క్లుప్తంగా

రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాం..

మధిర: మండలంలోని దెందుకూరు సొసైటీ చైర్మన్, మాజీ సర్పంచ్ కోట వెంకటకృష్ణ, విజయశాంతి దంపతులు రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదేళ్లగా రాజకీయాల్లో కొన సాగుతుండగా కాంగ్రెస్ నుండి విజయశాంతి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలిచారు. గ్రామంలో చోటుచేసుకున్న విభేదాలు, వ్యక్తిగత కారణాలతో తాము ప్రత్యక్ష రాజకీయాల నుండి వైదొలుగుతున్నామని తెలిపారు. అయితే, దెందుకూరు ప్రజలు, గ్రామాభివృద్ధికి మద్దతు ఇస్తూనే ఉంటామని వెల్లడించారు.

పోషణ అభియాన్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చంద్రుపట్ల సెక్టార్ పరిధిలో గల రఘునాథగూడెం జీపీలో గురువారం పోషణ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ.. గర్భిణులు బాలింతలు సక్రమంగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రియాంక, రేవతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి సావిత్రి, ఏఎన్ఎం ఉమారాణి, ఆశాలు పాల్గొన్నారు.

గొల్లపూడిలో..

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి, ఖానాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించి ప్రీస్కూల్‌పై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారుల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్.బీజాన్‌బీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మధిర: సివిల్ సప్లై కార్మికులకు జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం మధిర సివిల్ సప్లై గోడౌన్ వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా కానీ హమాలీల జీవితాలు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాబు, పుల్లయ్య, గోగుల నాగమల్లేశ్వరరావు, చింతల నాగరాజు, ప్రసాద్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పీఆర్‌ఓకు సన్మానం

కారేపల్లి: సీఎం పీఆర్‌ఓ, కారేపల్లి మండలం కమలాపురానికి చెందిన దూదిపాళ్ల విజయ్‌కుమార్ దంపతులను ఐకేపీ ఉద్యోగులు గురువారం సన్మానించారు. ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లుతో పాటు చైతన్య, పి.పుష్ప, షేక్ సోందు, టి.అనిల్, గౌసియా, విజయలక్ష్మి, నాగుబండి నాగలక్ష్మి పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు..

కారేపల్లి: మండలంలోని రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి, ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు డి.నాగేశ్వరరావు, దేవ్ సింగ్, మాన్‌సింగ్, కె.కాంతారావు, ఎం.చందర్‌రావు, బి.వీరన్న, బి.సక్రామ్, సీఆర్‌టీ బి.పద్మలను పూలమాలలతో సత్కరించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్.రాములు, శ్రీనివాసరావు, బిక్షం, వెంకటేష్, తార, రాంబాబు, వెంకటేశ్వర్లు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు

కొణిజర్ల: ఇటీవల మృతి చెందిన కొణిజర్లకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ దుగ్యాల కోటేశ్వరరావు (కోటి)కుటుంబానికి కొణిజర్ల మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. యూనియన్ సభ్యులు, రైతుల సహకారంతో సేకరించిన రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ కోటి కుమారుడు పేరుమీద చేయించారు. భార్యకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వీరన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు చిత్తు..!



పెద్దకోరుకొండిలో నీటిలో నానుతున్న పత్తిపంట (ఫైల్)
(ఇన్‌సెట్) వరదలకు కొట్టుకుపోయిన పత్తిచెట్లు

- అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో రైతులు

పత్తి రైతులకు అడుగడునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. అతివృష్టి.. అనావృష్టి కారణంగా పత్తి సాగు చేసిన రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు వేల ఎకరాల్లో పత్తిపంట దెబ్బతిన్నది. ఒక వైపు తెగుళ్ల బెడద.. మరోవైపు పంట నీట మునిగి రైతులు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. ఈసారి కూడా అప్పులే మిగులుతాయని ఆందోళన చెందుతున్నారు.

కల్లూరురూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి రైతులను చిత్తు చేస్తోంది. లాభాలు వస్తాయని ఆశించి రైతులకు నిరాశే మిగిలింది. పత్తి పంటలో నీరు నిల్వ ఉండటం వల్ల మొక్కవేరు కుళ్లిపోయి చెట్టు ఎర్రబారే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న పత్తి పంటకు అధిక వర్షాలు తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. వర్షం కారణంగా పిందెలు రాలిపోగా.. మొక్కలన్నీ నీటమునిగి రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అదే విధంగా వివిధ రకాల తెగుళ్లు, వైరస్ సోకి పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించనున్నాయి.

డివిజన్ పరిధిలో అపార నష్టం..

కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ, పెనుబల్లి, ఏన్కూరు మండలాల్లో సుమారు 28వేల ఎకరాలకుపైగా పత్తి పంటసాగు చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కొక్క ఎకరానికి సుమారు 20 నుండి 25వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. ఈ లెక్కన లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పత్తి పంట బాగా కాపుకాస్తుందని ఆశించిన రైతులకు అకాల వర్షాలు అపార నష్టాన్ని చేకూరుస్తున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో 30శాతంకుపైగా పత్తి పంట పాడై పోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. కల్లూరు మండలంలోని చెన్నూరు, చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం, తెల్లగారం, మర్లపాడు, లక్ష్మీపురం, బోడిమెల్ల, పేరువంచ, చంద్రుపట్ల, రఘునాథగూడెం గ్రామాల్లో పత్తిపంట విస్తారంగా పండిస్తున్నారు. మరికొన్ని రోజులు వర్షాలు ఇట్లాగే కురిసినట్‌లైతే పత్తి పంట మొత్తం సర్వనాశమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- అధిక వర్షాల వల్ల వేరుకుళ్లు నివారణకు గాను మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కార్బోబ్డిజం, ఒక గ్రాము లేదా రెండు గ్రాముల మ్యాన్కోజెబ్‌ను పిచికారీ చేయాలి.
- రసం పీల్చే పురుగు ఆశించినట్లయితే మోనోక్రోటోఫాస్ 1.6 ఎంఎల్ లేదా ఈమెడ 0.25 ఎంఎల్ లేదా ఎస్టేట్ 1.5 ఎంఎల్ పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు సోకినట్‌లైతే సీఓసీ 30 గ్రాములు ప్లాంటోమేషన్ కలిపి పిచికారీ చేయాలి.

ప్రభుత్వం కనికరం చూపించాలి..



అధిక వర్షాల వల్ల పత్తి పంటకు వైరస్ సోకి ఖర్చు అధికంగా ఉంటుంది. వర్షాల కంటే ముందు పత్తిపంట బాగానే ఉన్నప్పటికీ అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిని పోయింది. పూత, పిందే కూడా రాలిపోతుంది. పత్తి చేలల్లో నీళ్ల నిలిచిపోవటం వల్ల మొక్కల ఆకులు ఎర్రబారడంతో పాటు.. వివిధ రకాల తెగుళ్ల సోకుతున్నాయి. ప్రభుత్వం పత్తి రైతులపై కనికరం చూపించారు.

– కర్నాటి పిచ్చిరెడ్డి, రైతు, కప్పలబంధం

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీహరి

మధిరరూరల్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు పలువురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 13,14,15 తేదీల్లో హైదరాబాద్‌లోని మౌలాలిలో జరగనున్న 34వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు మాటూరు హైస్కూల్‌కి చెందిన సిలివేరు జయశ్రీ, మేడిశెట్టి భవాని, దేవిశెట్టి సుమలిక ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి తెలిపారు. పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కోలా వెంకట్రావమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

సిరిపురం విద్యార్థిని..

కల్లూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో సబ్ జూనియర్ సెలక్షన్‌లో సిరిపురం గ్రామానికి చెందిన కె.పౌర్ణమి ఎంపికైంది. ఈ సందర్భంగా పౌర్ణమితో పాటు పాఠశాల పీఈటీ కోటి, ఫిజికల్ డైరెక్టర్ రామును స్పోర్ట్స్ కన్వీనర్ టీం కోచ్ మన్నేపల్లి గురునాథం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..



నజీర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జితేష్‌సాహిల్

కొణిజర్ల: ఈ నెల 13 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–14 ఖోఖో పోటీలకు కొణిజర్ల మండలం అమ్మపాలెం పరిధిలో గల తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల కళాశాల పాఠశాల విద్యార్థి ఎస్‌కే నజీర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జితేష్ సాహిల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కల్లూరులో జరిగిన ఖోఖో ఎంపికల్లో నజీర్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎంపికైన విద్యార్థి నజీర్‌ను, పీడీ మిద్దెరవి, పీఈటీలను అభినందించారు.

గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలు

కల్లూరురూరల్: మండలంలోని 16 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులను జిల్లాలోని వివిధ మండలాలకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కల్లూరు మండలంలో పనిచేస్తున్న శీలం నాగేషారెడ్డిని చింతకాని మండలానికి, హరీష్‌ను కూసుమంచికి, ఎండీ ఆసీఫ్, శీలం అనూష, పి.మౌనిక ఏన్కూరు, దుగ్గిరాల నారాయణ, అశోక్, యమునా సింగరేణి మండలానికి, కె.రాజశేఖర్‌రెడ్డి, సాయిరాం మధులను ఎర్రుపాలెం మండలానికి(జేపీఎస్), పి.సుజాత రఘునాథపాలెం, పి.వి.రామకృష్ణను ఎర్రుపాలెం మండలానికి బదిలీపై వెళ్లారు. అదే విధంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి కల్లూరు మండలానికి బదిలీపై వచ్చిన కార్యదర్శులు ఏన్కూరు నుంచి స్వప్న, ధారవత్ కృష్ణయ్య, ఖమ్మం రూరల్ నుంచి ఆర్.సోజిని, శివ, శ్రీనివాస్, మధిర నుంచి భూక్య సైదులు, షేక్.హాజమైనుద్దీన్, సింగరేణి మండలం నుంచి జి.యాక లక్ష్మి, బి.కృష్ణవేణి, ఎ.నర్మదా, జి.లోకేశ్వరీ, తిరుమలాయపాలెం మండలం నుంచి ఎస్.రేవతి, పి.వెంకటరమణ, పి.రాజశ్రీ, వైరా నుంచి పి.శ్రీనివాసరావులు ఉన్నారు.

వరద బాధితులకు మేము సైతం..

నిత్యావసరాలు పంపిణీ..



బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు గండుగలపాడు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు గురువారం ప్రవాస భారతీయుడు దురిశాల దేశాయ్, వెంకట హనుమంతరావు, అఖిలసాయి అందించిన ఆర్థిక సాయంతో 25 కుటుంబాలకు నిత్యావరాలను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కర్నాటి హనుమంతరావు, పూర్ణకంటి జీవరత్నం, ఇనపనూరి దావీదు, బొడ్డు నారాయణ,పూర్ణకంటి వెంకటప్పుడు పాల్గొన్నారు.

5క్వింటాళ్ల బియ్యం వితరణ..



బియ్యం అందజేస్తున్న ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు

కారేపల్లి: కారేపల్లిలోని వెన్నెల గ్రామసమాఖ్య సభ్యులు వరద బాధితుల కోసం అందించిన 5క్వింటాళ్ల బియ్యాన్ని ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు బాధితులకు అందించి మాట్లాడారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు చైతన్య, వీఓఏ మమత, వెన్నెల వీవో అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి రమణ, కోశాధికారి ప్రమీల, మహేంద్ర, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

10 క్వింటాళ్ల బియ్యం..

తల్లాడ: వరద బాధితుల కోసం 10 క్వింటాళ్ల సంబమసూర బియ్యం సేకరించామని కాంగ్రెస్ నాయకుడు గణేశుల రవి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన ఈ బియ్యాన్ని ఖమ్మం వెళ్లి వరద భాదితులకు అందజేయనున్నట్లు తెలిపారు.

కల్లూరులోని కారుణ్య మూర్తి రెడీమేడ్స్..



బాధితులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: ఖమ్మం కరుణగిరి రాజీవ్ గృహకల్ప కాలనీలోని వరద బాధితుల సహాయార్థం కల్లూరు పట్టణం మధిర రోడ్‌కు చెందిన కారుణ్యమూర్తి రెడీమేడ్స్ యజమాని ఉబ్బన రాంబాబు వరద బాధితులకు రూ. 1.50 లక్షల విలువైన నూతన వస్త్రాలను అందించారు. దీంతో ఆయనను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాల వాహనాన్ని కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాంబశివరావు, ఉపేందర్ గౌడ్, నరసింహారావు, గురవయ్య, మౌబు, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గణేష నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



రహదారి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్, చైర్మన్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం నల్లకుంట చెరువులో జరిపే వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను గురువారం మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో కలిసి ఏసీపీ ఎం.ఏ రెహమాన్ పర్యవేక్షించారు. అనంతరం ఏసీపీ అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి ఇబ్బందులు కలగకుండా కంకరతో రహదారుల ఏర్పాటు చేయడం, రాత్రి సమయాల్లో ఇబ్బందులు కలగకుండా చెరువుల వద్ద లైట్లు ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట సీఐ నునావత్ సాగర్, ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్, మున్సిపల్ కమిషనర్ వేణు, మున్సిపల్ ఏఈ శంకర్, శానిటైజర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, సూర్యదేవర శ్రీధర్ పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ఆలయాల్లో సాయినాథుడికి గురువారం అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాబాని భక్తులు దర్శించుకొగా.. అర్చకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో రామాపురంకి చెందిన కొమ్మూరి నాగేశ్వరరావు – లక్ష్మి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతికి సంతాపం

సత్తుపల్లి/తల్లాడ/ఎర్రుపాలెం: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి పలువురు నాయకులు సంతాపం ప్రకటించారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎర్రుపాలెం సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి దివ్వెల వీరయ్య, తల్లాడలో సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వర్‌రావు సతాపం ప్రకటించి.. ఏచూరి కుటుంబసభ్యులను పరామర్శించారు. జాతీయస్థాయిలో పార్టీ బలోపేతానికి ఏచూరి చేసిన కృషి మరవలేనదన్నారు. ప్రభుత్వాలకు దిశ, నిర్దేశం చేసి ముందుకు నడిపించిన గొప్ప నాయకుడిని కోల్పోయామని అన్నారు. ఆయన మృతి దేశానికే తీరని లోటన్నారు. ఆయనను సంతాపం తెలిపిన వారిలో.. సీపీఎం నాయకులు భాస్కర్‌రావు, సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, మస్తాన్, నరేష్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు లాల్‌మియా, శ్రీనువాసరావు, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, రావూరి రవిప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలకు ఖండన

సత్తుపల్లిరూరల్: ఫిరాయింపు ఎమ్మెల్యేలనుద్దేశించి చీర, గాజులు పంపుతానంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు యావత్ మహిళాలోకాన్ని అవమానించడమే నని.. దీనికి ఆయన వెంటనే స్త్రీ జాతికి బేషరుతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు చీళ్ల నాగేశ్వరరావు, పసల ఏడుకొండలు, ఎండి జబ్రార్‌హుస్సేన్, పులిజాల సురేంద్రబాబులు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళా కమిషన్ తక్షణం కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ కార్యక్రమాలకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. గురువారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రఘురామిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.7.43 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజాలరాణి, మార్కెట్‌కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ..

మున్నేరు వరద బాధితులకు సహాయార్థం సత్తుపల్లి పట్టణంలో విరాళాల సేకరణ ఎమ్మెల్యే రాగమయి చేపట్టారు. ప్రతి షాపుకు వెళ్లటంతో వ్యాపారులు స్వచ్ఛందంగా విరాళాలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొమ ఆనంద్, ఎండీ కమల్‌పాషా, దూదిపాల రాంబాబు, తోట సుజలరాణి, మందపాటి పద్మజ్యోతి, టోపి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అశ్విని మరణం తీరని లోటు



అశ్విని కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోదండరాం

కారేపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్త అశ్విని మరణం ఆమె కుటుంబానికే సమాజానికి తీరని లోటని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మండలంలోని గంగారంతండాలో అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ చిత్రపటాల వద్ద గురువారం ఆయన నివాళులర్పించారు. అలాగే, అశిని తల్లి నేజి, సోదరుడు అశోక్‌కుమార్‌ను పరామర్శించి మాట్లాడారు. రాయపూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తూ ఆధునిక వంగడాలపై పరిశోధనలు చేస్తున్న అశ్వినితో పాటు ఆమె తండ్రి ఆకేరు వరద ఉధృతిలో మృతి చెందడం బాధాకరమని చెప్పారు. టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, నాయకులు ఎం.నరసయ్య, డోలి సత్యనారాయణ, ఎం.రామనాథం, వి.బాబు, దేవనాథం, ఎస్‌కే.సర్దార్ హుస్సేన్, పట్టు రాజేందర్, బెల్లంకొండ నాగేష్, రవికుమార్, మురళి, నాగిరెడ్డి, భరత్‌కుమార్, బి.రమేష్, కూరపాటి రాంగనాథరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు

ముదిగొండ: మండలంలోని బాణాపురంలో ఇటీవల మరణించిన స్వాతంత్ర్య సమరయోధుడు వెంకయ్య దశదిన కర్మకు వ్యవసాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గురువారం హాజరైయ్యారు. వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్‌బాబు, ముదిగొండ సొసైటీ చైర్మన్ యలగొండస్వామి పాల్గొన్నారు.

'మిస్ట్'లో ముగిసిన వర్క్‌షాప్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల(మిస్ట్)లో బీటెక్ సీఎస్సీ, ఏఐఎంఎల్ విద్యార్థులకు గత మూడురోజుల పాటు జరిగిన వర్క్ షాపు గురువారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో మెంటార్ వి.సాయిపవన్, బైనో విజన్ సోల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డేటా సైన్స్, మిషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ప్రాజెక్టులను ఎలా రూపొందించాలో నేర్పించటం జరిగింది. అదే విధంగా ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ నేటి సమాజ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, సిఎస్‌సీ విభాగం అధినేత పి.మారేశ్వరరావు, ఐక్యూసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి.రామచంద్రరావు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ఎం.రేవతి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు

తల్లాడ: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు తల్లాడ పంచాయతీ ఈఓ కృష్ణారావు ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు నిర్వహించారు. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో కొత్తగూడెం రోడ్డు వైపు వరద తాకిడికి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతలను కంకర, సిమెంట్‌తో గుంతలను పూడ్చారు.

భాగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న రైతులు

బోనకల్: వరదలకు కొట్టుకుపోయిన మండలంలోని ఆళ్లపాడు, నారాయపురం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. గురువారం భాగం ఫౌండేషన్ నిర్వాహకుడు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ సహకారంతో మరమ్మతు పనులు ప్రారంభించారు. దీంతో దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో భాగం రాధాకృష్ణ, రామిశెట్టి వెంకటేశ్వర్లు, బుంగ రాములు, బండిపుల్లయ్య, వెంకటి, జానీ, కృష్ణ, మునీర్, సురేష్, పుల్లరాజు, భాస్కరరావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'బురద మట్టి'తో మరమ్మతులు



బురద మట్టితో నిర్మించిన ప్రొద్దుటూరు - నేరడ రహదారి

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు – నేరడ గ్రామాల మధ్య ఉన్న రహదారి వర్షాలకు కోతకు గురవడంతో.. అధికారులు బురద మట్టితో మరమ్మతులు చేసి మమ అనిపించారు. కానీ ఆ రహదారిపై వెళ్తున్న ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బురదను తొలగించి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



ఏన్కూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఏన్కూరు: మండలంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కమ్మవారి కల్యాణ మండపంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రాజేశ్వరావు, మోహన్‌రావు, రామారావు, నర్సింహారావు, బీఎస్ఆర్ పాల్గొన్నారు.

గణేష్ మండపం వద్ద అన్నదానం..

కారేపల్లి: కారేపల్లి శ్రీవెంకటసాయినగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండలం వద్ద గురువారం అన్నదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం లడ్డు వేలం పాట నిర్వహించగా, కోర్టు కానిస్టేబుల్ నాగేశ్వరరావు రూ.17వేలకు లడ్డు దక్కించుకున్నాడు. అనంతరం గణేష్ విగ్రహాన్ని ఊరేగింపు చేసి, స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

గణపతి లడ్డూ 'రూ.35,000'

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కల్పతరురోడ్ శ్రీవిశ్వ జ్ఞానపీఠం మహాగణపతి లడ్డు రూ.35,000 పలికింది. ఈ లడ్డుని వేలంపాటలో ఎన్టీఆర్ జిల్లా మైలవరంకు చెందిన ఎం.రమేష్, విజయ దంపతులు దక్కించుకున్నారు. అనంతరం గణనాథులను ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

గణేష్ మండపంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర...

కల్లూరు: కల్లూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సండ్రను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ లక్కినేని రఘు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కృష్ణ, కమ్లి, ప్రసాద్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష గరిక పూజ..



పూజలో పాల్గొన్న శ్రీ నగర్ కాలనీవాసులు

తల్లాడ: తల్లాడ శ్రీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో గురువారం లక్ష గరిక పూజ నిర్వహించారు. అర్చకులు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం జరిగింది. లక్ష గరికలతో గణపతిని పూజించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.